క్లుప్తంగా

ఉత్సాహంగా మేలుకొలుపు



వాడ్రాపల్లిలో మేలుకొలుపులో భక్తులు

మునగపాక: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. భక్తులు తెల్లవారే నిద్రలేచి గ్రామాల్లోని దేవుళ్లను నిద్రలేపుతూ భజనలు చేస్తున్నారు. పిల్లలు, యువకులు, పెద్దలు సైతం మేలుకొలుపు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. తెల్లవారే నిద్ర లేచి చన్నీటిస్నాన మాచరించి డప్పు వాయిద్యాల నడుమ పార్వతీ పరమేశ్వరుల చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహిస్తున్నారు.

సంప్రదాయబద్ధంగా తోడపెద్దుకు అంత్యక్రియలు




తోడపెద్దు అంత్యక్రియల్లో భాగంగా ఏర్పాటు చేసిన సేవగరిడి

మునగపాక: నాలుగు గ్రామాల ప్రజలు ఆరాధ్యంగా పూజించే తోడపెద్దు అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. తోటాడ, గవర్ల అనకాపల్లి, సిరసపల్లి, నారాయడుపాలెం తదితర గ్రామాల్లో సింహాద్రి అప్పన్నగా కొలుచుకునే తోడపెద్దు అంత్యక్రియలు సేవగరిడీలతో ఊరేగించి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు.

21న మండల సర్వసభ్య సమావేశం

యలమంచిలి రూరల్: యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కొండలరావు తెలిపారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

మునగపాక ఎస్ఐ ప్రసాదరావుకు అభినందన



మునగపాక ఎస్ఐ ప్రసాదరావుకు ప్రశంసా పత్రం అందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

మునగపాక: మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావుకు బుధవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రశంసా పత్రంతో పాటు నగదు అందజేశారు. ఎస్ఐగా ప్రసాదరావు అందిస్తున్న సేవలను గుర్తించిన ఎస్పీ అనకాపల్లి పోలీసు కార్యాలయంలో అభినందించారు. పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని, గంజాయి నిర్మూలనకు పాటుపడాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ పటిష్టవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

డీఫారం రైతులకు న్యాయం చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న రైతులు

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భూములు కోల్పోతున్న పలువురు రైతులకు ఇంకా నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని, తక్షణం వారికి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం డీఎల్‌పురంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతు గింజాల వెంకటరమణ, తదితరులు తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. కంపెనీల కోసం ఏపీఐఐసీ సేకరించిన వాటిలో డీఫారం భూములు, ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న పలువురు రైతులకు నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియ పెండింగ్ ఉందన్నారు. చాలా మందికి ఫలసాయానికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. సమస్యను ఏపీఐఐసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఆహ్లాదమా.. అదెక్కడ?

పట్టణంలో కొమ్మాయిగుండం చెరువు పురాతనమైనది. ఈ చెరువు పరిరక్షణ ఎంతో ప్రాధాన్యతతో కూడినది. పట్టణవాసులకు ఆహ్లాదం పంచడానికి, సాయంత్రం, ఉదయం సమయాల్లో కాస్త సేద తీరడానికి ఈ చెరువు పరిసరాలు అనుకూలం. ఈ ప్రాధాన్యతను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.85 లక్షలతో చెరువు సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఈ పనులు మధ్యలో నిలిచిపోవడంతో ఇప్పటి వరకు పూర్తి చేసిన సుందరీకరణ లక్ష్యం నీరుగారింది.

- ఆగిన కొమ్మాయి గుండం చెరువు సుందరీకరణ పనులు
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.85 లక్షల మంజూరు
- కౌన్సిల్ సమావేశాల్లో పలుమార్లు ఈ విషయంపై ప్రశ్నించిన సభ్యులు
- పనులు పూర్తి కాకుండానే కాంట్రాక్టర్‌కు రూ.70 లక్షలకు ఎన్‌వోసీ జారీ చేసిన మున్సిపల్ అధికారులు



కొమ్మాయి గుండం చెరువులో బాగా పెరిగిన గుర్రపు డెక్క, ఇతర మొక్కలు



ఇటీవల స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుభ్రపరిచిన వాకింగ్ ట్రాక్



తుప్పు పట్టిపోతున్న ట్రీ గార్డులు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణ వాసులకు ఆహ్లాదం కరువైంది. సెలవు దినాలు, సాయంత్రం వేళల్లో పిల్లలతో కాసేపు సేద తీరుదామన్నా ఎక్కడా పార్కులు కానరావడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టిన పట్టణంలో బస్టాండు సమీపంలో కొమ్మాయిగుండం చెరువు సుందరీకరణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. సుమారు 1.70 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువు ఆధునికీకరణ కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ రూ.85 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు గతేడాది ఆగస్టు 16న చెరువు సుందరీకరణ పనులను అప్పటి ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదం ఇచ్చేలా ఈ చెరువు సుందరీకరణ పనులు అప్పట్లో చకచకా జరిగాయి. ఇంతలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కోడ్ కారణంగా పలు పనులు ఆగిపోయాయి. పనులు పూర్తికాకపోవడంతో కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు కూడా జరగలేదు. మే నెలలో జరిగిన సాధారణ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ చెరువు ఆధునికీకరణ పనులు మాత్రం ఇక తిరిగి ప్రారంభం కాలేదు. మధ్యలో ఆగిపోయిన సుందరీకరణ పనుల గురించి గత మున్సిపల్ పాలకవర్గాల సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు పలు మార్లు ప్రశ్నించారు. సభ్యులు ప్రశ్నించిన సమయంలో అప్పట్లో పనిచేసిన మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు ఆ పనులతో తమకు సంబంధం లేదని, అవన్నీ ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ అధికారులే చూసుకుంటారని, మున్సిపాలిటీది కేవలం ప్రేక్షకపాత్ర మాత్రమేనని సభాముఖంగా చెప్పారు. అయినప్పటికీ సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి సుందరీకరణ పనులు పూర్తయ్యేలా చూస్తామని కూడా చెప్పారు. తర్వాత అప్పట్లో పనిచేసిన అధికారులందరికీ బదిలీలు జరిగాయి. ఆ సమయంలో చెరువు సుందరీకరణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు గుట్టుచప్పుడు కాకుండా నిరభ్యంతర పత్రం జారీ చేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూరు కావాలంటే మున్సిపాలిటీ నుంచి నిరభ్యంతర పత్రం తప్పనిసరి. పనులు మధ్యలో ఆగిపోయినా రూ.70 లక్షల విలువ చేసే పనులు పూర్తయినట్టు పురపాలక సంఘం అధికారులు ఎన్‌వోసీ ఇవ్వడంతో కాంట్రాక్టర్‌కు బిల్లు మంజూరైంది. దీంతో మిగిలిన పనులు అలాగే ఉండిపోయాయి.

సుందరీకరణ పనులు పూర్తి చేయాలి



కొమ్మాయి గుండం చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేసి అందరికీ ఉపయోగపడేలా వినియోగంలోకి తేవాలి. లక్షల రూపాయల నిధుల ప్రజాధనం ఖర్చు చేసి చేపట్టిన పనులు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. అధికారులు సమన్వయంతో చొరవ తీసుకుని పనులు పూర్తిచేయడంపై దృష్టి సారించాలి.

– షేక్ బషీరాబేగం, గాంధీనగరం, యలమంచిలి

ఉద్యానవనంగా అభివృద్ధికి అవకాశం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు ఎంతో మంచి లక్ష్యంతో చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించారు. పనులు పూర్తయితే ప్రజలందరికీ ఉపయోగపడుతుంది. పట్టణంలో ఉద్యానవనాలు లేవు. కొమ్మాయిగుండం చెరువు ప్రాంతాన్ని ఉద్యానవనంగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. ఇందుకోసం కార్యాచరణ రూపొందించాలి. యలమంచిలి మున్సిపాలిటీగా ఏర్పడి 13 ఏళ్లు గడిచిపోయినా ఉద్యానవనాలు లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది.

– దూది నర్సింహమూర్తి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు

చేపట్టాల్సిన పనులు

సుందరీకరణలో భాగంగా చెరువులో మురుగునీరు, చెత్త, ఇతర వ్యర్థాలు తొలగించి, చుట్టూ ఇనుప గ్రిల్స్‌తో రక్షణ కంచె ఏర్పాటు, గట్టు చుట్టూ నిర్ణీత కొలతలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చుట్టూ మొక్కలు నాటి ట్రీ గార్డులు ఏర్పాటు చేయడం వంటివి చేపట్టాలి. వీటిలో కొంతమేర పనులు చేపట్టారు. మురుగునీరు తొలగించి గట్టు చుట్టూ నడక మార్గం నిర్మించారు. కానీ ఇప్పటి వరకూ చుట్టూ మొక్కలు నాటలేదు. మొక్కల కోసం తయారు చేయించిన ట్రీ గార్డులు చెరువుకు ఒకవైపున నిర్లక్ష్యంగా పడేశారు. ప్రస్తుతం అవి తుప్పుపడుతున్నాయి. వాకింగ్ ట్రాక్ నిర్మించినా చెరువు చుట్టూ ఆక్రమణలతో లోపలికి వెళ్లడానికి అవకాశం లేకుండాపోయింది. చెరువు పరిసరాల్లో బాగా తుప్పలు పెరిగాయి. అయితే ఇటీవల స్వచ్ఛతా హీ సేవలో భాగంగా కొమ్మాయిగుండం చెరువు చుట్టూ పెరిగిన తుప్పలు, వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. చుట్టూ నాటాల్సిన మొక్కల్ని గుత్తేదారుడు అప్పట్లోనే కొనుగోలు చేసి తెచ్చారు. ఎన్నికల తర్వాత పనులు జరగకపోవడంతో చెరువు చుట్టూ నాటాల్సిన మొక్కలన్నీ ఒకమూలన ఉండిపోయాయి. వాటిలో ఎక్కువ శాతం మొక్కలు ఎండిపోగా, కొన్ని మొక్కలు మాత్రం వర్షాలకు ఒకేచోట పెరిగి ఉన్నాయి. సుందరీకరణలో భాగంగా శుభ్రపరిచిన చెరువులో ప్రస్తుతం గుర్రపు డెక్క కూడా బాగా పెరిగిపోయింది. ఎంతో మంచి లక్ష్యంతో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉండిపోవడంతో ఖర్చు చేసిన నిధులు కూడా ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఇప్పటికైనా అసంపూర్తిగా నిలిచిపోయిన కొమ్మాయిగుండం చెరువు సుందరీకరణ పనులు పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉంది. పనులు పూర్తయ్యేలా చూసి చెరువు పరిసరాల్లోకి ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్లు, సీనియర్ సిటిజన్లు వచ్చేలా చేస్తే భవిష్యత్తులో పార్కుగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉంది.

ప్రజాధనం వృథా కానివ్వొద్దు



చెరువు సుందరీకరణ పనులు అసంపూర్తిగా ఉండిపోవడం దురదృష్టకరం. పట్టణంలో పార్కులు లేవు. ఈ చెరువు పూర్వకాలం నాటిది. దీనిని అభివృద్ధి చేస్తే ఆక్రమణలకు కూడా అడ్డుకట్టపడుతుంది. సుందరీకరణ పనులు పూర్తయితే తమకు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి వస్తుందని భావించిన ప్రజలకు ప్రస్తుత పరిస్థితి నిరాశను కలిగిస్తోంది. సుందరీకరణకు ఇప్పటి వరకు వెచ్చించిన ప్రజాధనాన్ని వృథా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సీహెచ్ నవీన్, సైతారుపేట రోడ్డు, యలమంచిలి

ఆందోళనలో అన్నదాత



జల్లూరులో వరి చేను కోస్తున్న కూలీలు



కొరుప్రోలులో పొలంలోనే వరిపనలు



యండపల్లిలో వరి కుప్ప వేస్తున్న రైతులు

కోటవురట్ల: అల్పపీడనం అన్నదాతను వదలనంటోంది. సరిగ్గా చి'వరి'దశలో వరుస తుపానులు అన్నదాతను కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. వరి చేలు బాగా పండాయన్న సంతోషం ఆవిరైపోయేలా చేస్తున్నాయి. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో 4 వేల ఎకరాలకు పైగా వరి సాగు జరిగింది. ఆది నుంచి వాతావరణం అనుకూలించడంతో చేలన్నీ ఏపుగా పెరిగి ధాన్యపు గింజలతో కళకళలాడుతున్నాయి. తెగుళ్ల బెడద నుంచి కూడా తప్పించుకుని తుది దశ కోతకు చేరుకున్నాయి. నేడో రేపో కోతలు చేపడతామనగా.. ఫెంగల్ తుపాను అనుకోని చుట్టంలా వచ్చి ఇబ్బంది పెట్టింది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు వరి కోతలను సుమారు 15 రోజుల పాటు వాయిదా వేసుకున్నారు. సూరీడు కాస్త బయటకు రావడంతో రైతులు ఊపిరిపీల్చుకుని గత 5 రోజులుగా వరి కోతలు నిర్వహిస్తున్నారు. మండలం అంతా ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్నాయి. దాదాపు 70 శాతం వరి కోతలు కూడా పూర్తయ్యాయి. కొన్ని ప్రాంతాలలో పనలు మడుల్లో ఉండగా.. మరికొన్ని ప్రాంతాలలో కూడా కుప్పలు వేసుకున్నారు. అయితే తాజాగా మరో అల్పపీడన ప్రకటనతో రైతుల్లో మళ్లీ కలవరం మొదలైంది. పనలు తడిసి పాడయ్యే ప్రమాదం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి మబ్బులు కమ్ముకుని వాతావరణంలో పూర్తిగా మార్పు చోటుచేసుకుంది. బుధవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో పలు ప్రాంతాలలో వర్షం కురిసింది. దాంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. చివరి గింజలను దక్కించుకునేందుకు ప్రస్తుతం పరుగులు తీస్తున్నారు. జోరుగా వరి పనలు ఎత్తి కుప్పలు వేస్తున్నారు.

పొలంలోనే చేలు

ఎస్.రాయవరం: మండలంలో ఈ ఏడాది అత్యధికంగా సుమారు 10 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. చివరి దశ కోతలు పూర్తి చేసి కుప్పలు వేసుకునే సమయంలో తుపాన్ భయం వెంటాడుతోంది. బుధవారం తెల్లవారుజామున కురిసిన ఓ మోస్తరు వర్షానికి కోసిన వరి పనలు తడిచి ముద్దయ్యాయి. దీంతో అన్నదాతలు చేతికందొచ్చిన పంట పాడైపోతోందని ఆందోళన చెందుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్ష సూచనలు ఉండడంతో పొలంలో ఉన్న చేలును ఏం చేయాలో తెలియక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్జీల స్వీకరణ సరే.. పరిష్కారమెప్పుడో?

చినఉప్పలం రెవెన్యూ సదస్సులో రైతులు ఏకరవు



చినఉప్పలం రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేస్తున్న రైతు

ఎస్.రాయవరం: భూసమస్యలపై రెవెన్యూ అధికారులకు ఎన్ని దరఖాస్తులు అందించినా ఫలితం లేదని పలువురు రైతులు చినఉప్పలం రెవెన్యూ సదస్సులో ఏకరవు పెట్టారు. గ్రామంలో తహసీల్దార్ జె.రమేష్ బాబు అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో 56 అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. ఎక్కువగా పట్టాలు ఇచ్చారు.. భూమిని చూపించలేదు, మరికొన్ని ఆన్‌లైన్ చేయడం లేదని, తదితర సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. జిల్లా కలెక్టర్ నివేదిక మేరకు చర్యలు తీసుకుని అర్హులైన రైతులకు భూమిని ఆన్‌లైన్ చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. మండల సర్వేయర్ మూర్తి, ఆర్ఐ మణికంఠ, వీఆర్వో శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పల్లపు ఆనందపురంలో మాట్లాడుతున్న మునగపాక డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు

మునగపాక: రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు అన్నారు. మండలంలోని పల్లపు ఆనందపురంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూసమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తుందన్నారు.

కోటవురట్ల: రెవెన్యూ సదస్సులతో రైతుల భూసమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయని తహసీల్దారు తిరుమలబాబు అన్నారు. టి.జగ్గంపేటలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ భూ సమస్యలను పారదర్శకంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై 16 దరఖాస్తులు వచ్చాయి.

అభివృద్ధికి సమన్వయం అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు. మునగపాక మండల పరిషత్ హాలులో బుధవారం సర్పంచ్‌లు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాతా శిశు మరణాలు తగ్గేలా చూడాలన్నారు. ఆరోగ్యవంతమైన గ్రామాలు తయారు కావాలన్నారు. గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా చూడాలన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పాటుపడాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి మాట్లాడుతూ మునగపాక మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, ఈవోఆర్డీ సోమరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, మండల ఇంజినీరింగ్ అధికారి గులామ్ పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై ముగిసిన శిక్షణ

యలమంచిలి రూరల్: గ్రామాల్లో సుస్థిరాభివృద్ధిపై 17 అంశాలకు సంబంధించి రెండ్రోజుల పాటు స్థానిక ఎంపీడీవో కార్యాలయం మీటింగ్ హాల్‌లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ విభాగాలకు చెందిన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్థానిక సుస్థిరాభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ రాజాన శేషు, డీఎల్‌డీవో ఎస్.మంజులవాణి, పరిశీలకుడు శ్రీనివాస్, ఎంపీడీవో కొండలరావు, ఏవో ప్రసాద్ పాల్గొన్నారు.

వరి కోతలను వాయిదా వేసుకోండి



క్షేత్ర స్థాయిలో వరి కుప్పను పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట: రెండు రోజుల పాటు తుపాను కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులందరూ వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పాత్రేరు గ్రామంలో ఆయన పర్యటించారు. ఇప్పటికే కోసిన వరి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రకృతి వ్యవసాయం, పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు వరి కుప్పలు పెట్టే విధానాన్ని పరిశీలించి, సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది గుప్తా, వీహెచ్‌ఏలు, ఏహెచ్‌ఏలు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



కోటవురట్లలో శిక్షణ అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు

కోటవురట్ల: ప్రణాళిక ప్రకారం పంచాయతీల సుస్థిరాభివృద్ధికి కృషి చేయాలని ఏపీఎస్ఐఆర్డీ డిప్యూటీ డైరెక్టర్ రామనాథం సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్పంచులు, మండల స్థాయి అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ పంచాయతీల స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి కావలసిన వనరులను గుర్తించి ప్రణాళిక చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఈవోపీఆర్డీ రఘురాం, ఏవో చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే ప్రణాళికలు సిద్ధం



సర్పంచ్‌ల , సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న నక్కపల్లి ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి: గ్రామాభివృద్ధి కోసం చేపట్టే పనులకు సంబంధించి ప్రజల భాగస్వామ్యంతోనే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. పంచాయతీల నుంచి స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ముందుగానే లక్ష్యాలను నిర్ణయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కుమారపురంలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని కుమారపురంలో గురువారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రామాలయం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ క్లియరెన్స్ కారణంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుడివాడ ఫీడర్ పరిధిలో గుడివాడ, గుర్రాజుపేట, కొత్తపోలవరం, చినఉప్పలం, రేవుపోలవరం, పెదఉప్పలం, బంగారమ్మపాలెం, లక్ష్మీపతిరాజుపేట, సోమిదేవపల్లి ఫీడర్ పరిధిలో తిమ్మాపురం, గ్రామాలకు విద్యుత్ ఉండదన్నారు.

వర్గీకరణ ఏకసభ్య కమిషన్‌కు వినతులు



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందిస్తున్న పెదపాటి మేఘరంజన్



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతి పత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పాయకరావుపేట: ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు విశాఖపట్నం కలెక్టరేట్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు ప్రధాన కార్యదర్శి పెదపాటి మేఘరంజన్ వినతి పత్రం అందజేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక వర్గీకరణ, క్రీమీలేయర్ తీర్పు సమీక్షకు చర్యలు తీసుకోవాలని కోరారు. మాల మహానాడు నాయకులు చిరుకూరి పేర్రాజు, ఇంజరపు సూరిబాబు, తాటిపాక లోవరాజు, బద్దా నర్సింగరావు, బోడపాటి సురేష్ పాల్గొన్నారు.

– కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు విశాఖ కలెక్టరేట్‌లో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంపల చిన్నరాజు వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంజులూరి దుర్గాప్రసాద్, కుందురు కుమార్, గంపల సుబ్బారావు, బొడ్డపాటి వీరస్వామి, కందేల్లీ చంటిబాబు, గర్లంక ఆనంద్, కొమ్ముకూరి కృష్ణ, పేదపూడి స్వామియ్య పాల్గొన్నారు.

కోటవురట్ల: ఎస్సీలలో మాదిగ, అనుబంధ కులాలకు, రెల్లి, అనుబంధ కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విశాఖ కలెక్టరేట్‌కు విచ్చేసిన వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం కోరారు. ఈ మేరకు వినతి పత్రం సమర్పించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వి.రాంబాబు, గంటేడ లోవరాజు, చందా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.